నమస్తే తెలంగాణ

ములుగు

జయశంకర్ భూపాలపల్లి

5 | వరంగల్, శుక్రవారం 21 మార్చి 2025 | MULUGU JAYASHANKAR BHUPALPALLY




నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

# సర్కార్‌పై రైతులు మర్లబడే రోజొచ్చింది

- నీళ్లుండి ఇయ్యలేని దుస్థితి కాంగ్రెస్ ప్రభుత్వాది
- ఎకరాకు రూ. 25 వేలిచ్చేవరకు వదిలేది లేదు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- దేవరుప్పలలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతు నిరసన దీక్ష
- ఎండిన పంటలను పరిశీలించిన ఎర్రబెల్లి

దేవరుప్పుల, మార్చి 20: 'కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన హామీలను అరకొర అమలు చేసింది. అన్ని వర్గాలు నిరాశ నిస్పృహలతో ఉన్నారు. నీళ్లుండి ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉండగా యాసంగి పంటలు ఎండి రైతులు ఆగమైండ్రు. వారు మర్లబడే రోజొచ్చింది' అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. జనగామ జిల్లా దేవరుప్పులలోని అంబేద్కర్ సెంటర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు నిరసన దీక్ష చేపట్టగా, రైతులు, బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని తమ గళం విప్పారు. ఎండిన పంటలు చేత బూని తమ నిరసన తెలిపారు. దీక్షకు మద్ద తుగా ఎర్రబెల్లి హాజరై మాట్లాడారు. సాగునీటి మీద కనీస ప్రణాళిక, అవగా హన ప్రభుత్వానికి లేక దేవాదుల నీరు వదలక రిజర్వాయర్లలో నీరు లేక చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలు నింపక భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి బోర్లు, బావులు ఎండాయన్నారు. కేసీఆర్ పాలనలో నీళ్లు న్నాయనే నమ్మకంతో రైతులు నాట్లు వేశారని, ఇప్పుడు ఒక్క తడితో చేతికొచ్చే పంటలను పశు వులకు మేపుతుండ్రని, వారికి భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వం ఆ ఊసే ఎత్తడంలేదన్నారు. వీరికి బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని, పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 25 వేలు ఇచ్చే వరకు వదిలేది లేదని స్పష్టం చేశారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని, దీనికి దేవరుప్పుల రైతులు నాంది పలికారన్నారు. రేవంత్‌రెడ్డి మూర్ఖుడని, జనం బలహీనతను ఓట్లుగా మార్చుకుని గద్దె నెక్కాడన్నారు. ఆయన నిజస్వరూపం ప్రజలకు అనతి కాలంలోనే తెలిసిపోయిందని, ఇప్పుడు ఎన్నికలేవైనా కాంగ్రెస్ పార్టీ నామరూపాలు లేకుండా పోతుందని పేర్కొన్నారు. చెన్నూరు. పాలకుర్తి, ఉప్పుగల్లు రిజర్వాయర్ల పనులు ఆగాయని, రూ. 500 కోట్లతో మంజూరైన పనులు చేయడానికి ఏం వచ్చిందని ప్రశ్నించారు. సాగు నీరులేక రైతుల పంటలు ఎండుతుంటే ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించాల్సింది పోయి అనవసర విషయాలను మాట్లాడడం ఆమె పని తీరును చాటుతుందన్నారు. తాను నీటిని వదలాలని అధికారులకు కోరితే రాకుండా చేస్తుందని, పాలన మరచి బీఆర్‌ఎస్ నాయకులు, జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టడమే పనిగా పెట్టుకుందని ఆరోపించారు. పాలకుర్తి నియోజకవర్గంలో కేసీఆర్ హయాంలో జలకళ సంతరించుకున్నదని, తాను మంత్రిగా ఉన్న సమయంలో ఎండాకాలంలో చెరువులు, కుంటలు నింపేదని, దీంతో పుష్కలంగా భూగర్భ జలాలు ఉండేవన్నారు. కాంగ్రెస్ వచ్చింది.. కరువు తెచ్చిందని రైతులు మరచిపోతున్నారని, ఇటు ఎస్సారెస్పీ అటు దేవాదుల నీరు రాక వారు ఆగమై సర్కారుకు శాపనార్థాలు పెడుతున్నారని ఎర్రబెల్లి పేర్కొన్నారు. దీక్ష అనంతరం రూ. 25 వేలు నష్టపరిహారం డిమాండ్ చేస్తూ రైతులతో పాటు కిలోమీటర్ నడిచి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం కామారెడ్డిగూడెంలో రైతు మరాఠి యాదగి రి నాలుగెకరాల వరి పంట ఎండగా, పరిశీలించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, నాయకులు పల్లా సుందరరాంరెడ్డి, వీరారెడ్డి దామోదర్ రెడ్డి, బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్, బస్వ మల్లేశ్, ఏల సుందర్, చింత రవి, కొల్లూరు సోమయ్య, వైస్ ఎంపీపీ కత్తుల విజయ్‌కుమార్ రెడ్డి, జీసీసీ మాజీ చైర్మన్ గాంధీనాయక్, మాజీ జడ్పీటీసీలు శ్రీని వాస్, పూస్కూరి శ్రీనివాస్ రావు, గూడూరు పీఏసీఎస్ చైర్మన్ బొబ్బల అశోక్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పాలకుర్తి, తొర్రూరు మండ ల అధ్యక్షులు నవీన్, సీతారాం, రాంసింగ్, వంగ అర్జున్, కోతి ప్రవీ ణ్, కుతాటి నర్సింహులు, ఇంటి మల్లారెడ్డి, సంజీవరెడ్డి, నవీన్‌నాయక్, కృష్ణమూర్తి, బిళ్ల యాద వరెడ్డి, గిరి, కృష్ణ ఉన్నారు.

### బర్రెదుడ్డెలకు తాపుదామంటె చెర్ల నీళ్లు లేవు



బంజర చెరువుల బర్రెదుడ్డెలకు తాపుదామంటె నీళ్లు లేవు. ఇంత అన్యాయం అయితదనుకోలే. కేసీఆర్ పుణ్యమా అని మిషన్ కాకతీయల చెరువులు బాగుపడ్డయి. కాంగ్రెస్ ప్రభుత్వం రాక ముందు రెండు కార్లు చెరువులు నింపేది. ఎకరన్నర నాటు పెడితె నీళ్లు ఎండిపోయింది. పదేండ్ల నుంచి ఇట్ల చూడలేదు. యాసంగి పంటలు 70 శాతం ఎండినయ్. నీళ్లు తేవాలనే సోయి ఉన్న నాథుడే లేడు. రేవంత్‌రెడ్డికి పాలన చేతకాదని తేలిపోయింది.

*– సంగి నర్సయ్య, రైతు బంజర*

# నో గ్యారెంటీ..

## పైలట్ గ్రామాల్లో అటకెక్కిన పథకాలు

- కానరాని 100 శాతం అమలు
- జాబితాలు సిద్ధమైనా కొర్రీలే
- చెప్పిందొకటి.. చేసేది మరొకటి?
- సర్కార్ తీరుపై వెల్లువెత్తుతున్న ప్రజాగ్రహం
- జనగామ జిల్లా ఎర్రకుంటతండా, కన్నాయపల్లిలో పర్యటించిన 'నమస్తే తెలంగాణ'

ఫీల్డ్ విజిట్

జనగామ, మార్చి 20 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలు కోసం ఎంపిక చేసిన పైలట్ గ్రామాలు.. లబ్ధిదారుల జాబితాలు ప్రహసనంగా మారాయి. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపికచేసి లబ్ధిదారులకు నాలుగు పథకాలు వందశాతం అమలు చేస్తామని జనవరి 26న అట్టహాసంగా ప్రకటించినా క్షేత్రస్థాయిలో పరిస్థితులు వేరుగా ఉన్నాయి. జనగామ జిల్లాలోని అన్ని పైలట్ గ్రామాల్లోని వాస్తవ పరిస్థితులను తెలుసుకున్న 'నమస్తే తెలంగాణ' జనగామ మండలం ఎర్రకుంట తండా, రఘునాథపల్లి మండలం కన్నాయపల్లి గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించింది. అయితే ఆయా గ్రామాల్లో అట్టహాసంగా లబ్ధిదారుల జాబితాను చదివిన అధికారులు కొద్ది మందికే ప్రొసీడింగ్స్ ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఈ గ్రామాల్లో పథకాల అమలు అటుంచితే కనీస సదుపాయాలు కల్పించకపోవడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. గతంలో కేసీఆర్ సర్కారు ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు ఎండిపోతున్నా.. వాటిని పట్టించుకునే నాథుడే లేడు. గ్రామపంచాయతీలకు ఇచ్చిన ట్రాక్టర్లు మరమ్మతుకు వచ్చి మూలనపడ్డాయి. గ్రామపంచాయతీలో ట్రాలీలు కూడా రోడ్డున పక్కన పడేయడంతో పారిశుధ్య నిర్వాహణ అధ్వానంగా మారింది. డంపింగ్ యార్డులు వినియోగంలో లేక శిథిలావస్థకు చేరగా.. చెత్త సెగ్రిగేషన్ షెడ్లు ఉపయోగంలో లేవు. శ్మశాన వాటికలు నిర్వాహణ లేక నిరుపయోగంగా మారుతున్నాయి. జిల్లాలోని బచ్చన్నపేట మండలం సాల్వాపూర్, చిల్పూరు మండలం ఫత్తేపూర్ శివారు గొర్లగడ్డతండా, దేవరుప్పుల మండలం మాదాపురం శివారు లకావత్‌తండా, స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తానేదార్‌పల్లి, జనగామ మండలం పెద్దపహాడ్ శివారు ఎర్రకుంటతండా, కొడకండ్ల మండలం మొండ్రాయి శివారు నీళ్లబావి తండా, లింగాలఘనపురం మండలం కొత్తపల్లి, నర్మెట మండలం బొమ్మకూరు, పాలకుర్తి మండలం తీగారం, రఘునాథపల్లి మండలం కన్నాయపల్లి, తరిగొప్పుల మండలం వాచ్యాతండా, జఫర్‌గడ్ మండలం శంకర్‌తండాను పైలట్ గ్రామాలుగా ఎంపిక చేసి నాలుగు పథకాలను వందశాతం అమలు చేస్తామని ఆర్భాటంగా ప్రకటించారు. అయితే ఇందులో రెండింటిలోనే కదలిక ఉండగా, మరో రెండు అటకెక్కాయి. దీంతో ప్రధానంగా ఇందిరమ్మ ఇండ్ల కోసం ఆశపడ్డ వారికి నిరాశే మిగిలింది. ఎక్కడా కూడా పూర్తిస్థాయిలో అన్ని పథకాలకు లబ్ధిదారుల ఎంపిక జరగలేదు. జాబితాల్లో పేర్లున్న వారంతా లబ్ధిదారులు కాదని, మళ్లీ తుది జాబితా ఉంటుందని అధికారులు ప్రకటించడంతో అంతటా గందరగోళ పరిస్థితి నెలకొన్నది. పైలట్‌తో సహా మిగిలిన గ్రామాల్లో ఇప్పటి వరకు కేవలం మూడు ఎకరాల్లోపు విస్తీర్ణం కలిగిన రైతుల్లో సగం మందికే రైతు భరోసా జమచేయడంతో కాంగ్రెస్ సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### పత్రాలిచ్చారు.. అమలు మరిచారు

**ఎర్రకుంటతండాలో కానరాని పథకాల జాడ**


జనగామ రూరల్ : జనగామ మండలంలోని పైలట్ గ్రామమైన ఎర్రకుంట తండాలో సుమారు 800 వరకు జనాభా ఉంటుంది. ఈ గ్రామంలో నాలుగు పథకాల కోసం దరఖాస్తులు తీసుకున్న అధికారులు గ్రామసభలో అర్హుల జాబితా చదివి వినిపించారు. అందులో కొద్దిమందికే మంజూరు పత్రాలు అందజేశారు. ఇందిరమ్మ ఇండ్లకు 41 మంది, కొత్త రేషన్ కార్డులకు 18 మందికి అధికారులు ప్రొసీడింగ్స్ ఇచ్చి చేతులు దులుపుకున్నారు. కానీ, ఇప్పటి వరకు ఇండ్లు కట్టింది లేదు.. రేషన్ కార్డులు ఇచ్చింది లేదు. భూమి ఉన్న వారికి మాత్రమే రైతు భరోసా డబ్బులు పడ్డాయి. మిగతా పథకాల అమలు జాడలేదు. గ్రామంలో కొత్తగా ఒక్క సీసీ రోడ్డు వేయలేదని, డ్రైనేజీలు ఏర్పాటు చేయలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా అర్హులున్నా కొందరినే ఎంపిక చేశారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇండ్లు కట్టుకుంటే ప్రభుత్వం డబ్బులు ఇస్తుందనే నమ్మకం లేదన్నారు. కేవలం 50 గజాల్లో ప్రభుత్వం చెప్పినట్లు నిర్మిస్తేనే బిల్లులు మంజూరు చేస్తామని అధికారులు అంటున్నారని లబ్ధిదారులు తెలిపారు.

### ఇండ్లు లేవు.. రేషన్ కార్డులు లేవు..



దేవరుప్పుల మండలం లకావత్ తండాను మోడల్ గ్రామపంచాయతీగా ప్రకటించి ప్రత్యేక గ్రామసభను గణతంత్ర దినోత్సవం రోజు ఏర్పాటు చేశారు. ఆరుగ్యారెంటీలు ఈ గ్రామంలో వందశాతం అమలు చేస్తామని ప్రకటించి 53 మందికి ఇండ్లు, 56 మందికి రేషన్ కార్డులు, 11 మంది మహిళలకు ఆత్మీయ భరోసా పత్రాలు చేతికందించి చేతులు దులుపుకున్నారు. ఇప్పటి వరకు ఇండ్లు లేవు, రేషన్ కార్డులు లేవు, ఆత్మీయ భరోసా జాడ లేదు. రైతు భరోసా మాత్రం మూడెకరాల వరకు మాధాపురం రెవెన్యూ గ్రామాల రైతులకు జమైనయ్.

*–బానోత్ యాకూనాయక్, మాధాపురం మాజీ ఎంపీటీసీ*



రఘునాథపల్లి: కన్నాయపల్లిలో పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న వైకుంఠధామం



జనగామ రూరల్: ఎర్రకుంట తండా ప్రధాన కాలనీ



కన్నాయపల్లిలో నిరుపయోగంగా మారిన క్రీడా ప్రాంగణం

### ముగ్గు పోసినా.. పనులు ప్రారంభం కాలే..

**కన్నాయపల్లిలో అమలుకు నోచని పథకాలు**

రఘునాథపల్లి : మండలంలో పైలట్ గ్రామంగా ఎంపిక చేసిన కన్నాయపల్లిలో సుమారు 826 జనాభా ఉండగా అందులో 673 మంది ఓటర్లున్నారు. గ్రామంలో 243 మందికి రేషన్‌కార్డులు, 20 మందికి ఆత్మీయ భరోసా, 45 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయి. 19 మంది ఇండ్లకు ముగ్గులు పోసినప్పటికీ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. రైతుభరోసా కొంతమందికే జమయ్యిందని రైతులు వాపోయారు. బీఆర్‌ఎస్ హయాంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం ఎండిపోగా, క్రీడా ప్రాంగణంలోని పరికరాలు నిర్వహణ లేక తుప్పుపట్టాయి. వైకుంఠధామంలో ఏర్పాటు చేసిన నీటి ట్యాంక్ కింద పడిపోయింది. తమది పేరుకే పైలట్ గ్రామమని, ఏడాదిగా కనీస అభివృద్ధికి నోచుకోలేదని గ్రామస్తులు అన్నారు. కేసీఆర్ పాలనలోనే సకాలంలో పథకాలు అందాయని గ్రామస్తులు గుర్తుచేసుకున్నారు.

# రూ.1071.48 కోట్లతో బల్దియా బడ్జెట్

- ఆమోదించిన కౌన్సిల్
- సొంత ఆదాయం రూ. 337.38 కోట్లు
- గ్రాంట్ల రూపేణా రూ. 728.10 కోట్లు

వరంగల్, మార్చి20: గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ 2025–26 ఆర్థిక సంవత్సరానికి భారీ బడ్జెట్ ప్రవేశ పెట్టింది. గురువారం కౌన్సిల్ హాల్‌లో మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశంలో రూ. 1071.48 కోట్ల బడ్జెట్ అంచనాలకు పాలకవర్గం ఆమోదం తెలిపింది. ఇటీవల మృతి చెందిన మాజీ కౌన్సిలర్ ఏకుల కొర్నేలుకు సంతాప తీర్మానంతో పాటు బడ్జెట్‌పై చర్చ గంటలోనే ముగిసింది. అకౌంట్ అధికారి సరిత సభలో బడ్జెట్ అంచనాలు వెల్లడించగా సభ్యులు ఆమోదం తెలిపారు. గత బడ్జెట్ కంటే ఈసారి రూ. 421.36 కోట్ల అంచనాలు పెరిగాయి. రూ.337.38 కోట్లు బల్దియా సొంత ఆదాయంగా, వివిధ గ్రాంట్ల రూపేణా 728.10 కోట్లు వస్తాయని అంచనా వేసింది. రూ. 6కోట్లు డిపాజిట్లు, అడ్వాన్స్‌లు కలుపుకొని రూ.1071.48 కోట్లుగా బడ్జెట్ అంచనా వేశారు. సొంత ఆదాయంలో 10 శాతం గ్రీన్ బడ్జెట్‌గా రూ.33.74 కోట్లు కేటాయించారు. దీనితో పాటు 42 విలీన గ్రామాల అభివృద్ధికి రూ. 24.77 కోట్లు కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 627.82 కోట్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 55.28 కోట్ల నిధులు గ్రాంట్ల రూపేణా వస్తాయని అంచనా వేశారు. అలాగే సొంత అదాయంలో పన్నుల రూపేణా రూ. 100.50 కోట్లు, స్టాంప్ డ్యూటీ ఫీజులు రూ. 40 కోట్లు, మున్సిపల్ ఆస్తుల కిరాయిలు రూ. 9.27 కోట్లు, భవన నిర్మాణ అనుమతులు రూ. 136.05 కోట్లు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు రూ. 21.76 కోట్లు, నల్లా పన్నులు రూ. 29.82 కోట్లు వస్తాయని చూపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే గ్రాంట్లలో 15వ ఆర్థిక సంఘం నిధులు, పట్టణ ప్రగతి ద్వారా రూ. 75లక్షలు, ప్లాన్ గ్రాంట్‌లో ఎస్సీ, ఎస్టీ, ట్రైబల్, మైనార్టీ సబ్‌ప్లాన్, స్వచ్ఛభారత్ మిషన్, సీఎంఏ పథకాల ద్వారా రూ. 143 కోట్లు, నియోజవర్గ అభివృద్ధి, స్పెషల్ డెవలప్‌మెంట్, ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ. 510.10 కోట్లు వస్తాయని బడ్జెట్‌లో చూపారు. సమావేశంలో మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



బడ్జెట్ అంచనాలను వెల్లడిస్తున్న అకౌంట్ అధికారి సరిత



బడ్జెట్ సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు

# ఆల్ ది బెస్ట్..

- నేటి నుంచి 'పది' పరీక్షలు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 245 కేంద్రాలు
- పరీక్షలు రాయనున్న 42,468 మంది విద్యార్థులు
- గ్రేడింగ్ విధానానికి స్వస్తి


నమస్తే నెట్‌వర్క్, మార్చి 20 : పదో తరగతి పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 245 ఎగ్జామ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. మొత్తం 42,468 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగనుండగా, ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చే వారిని మాత్రమే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఆ తర్వాత వస్తే లోపలికి రానివ్వరు. హనుమకొండ జిల్లాలో 67 కేంద్రాలు.. 12,061 విద్యార్థులు, జయశంకర్ భూపాలపల్లిలో 21.. 3,449, జనగామలో 41.. 6,238, మహబూబాబాద్‌లో 46.. 8,194, వరంగల్‌లో 49.. 9,392, ములుగులో 21.. 3134 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షల కోసం అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. కాగా, ప్రభుత్వం పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఇప్పటి వరకు ఉన్న గ్రేడింగ్ విధానానికి స్వస్తి పలికింది. గతంలో అంతర్గత పరీక్షలకు 20, వార్షిక పరీక్షలకు 80 మార్కులు ఇస్తున్నారు. ఇప్పుడు ఒక్కో సబ్జెక్టు 100 మార్కులకు రాత పరీక్షలు నిర్వహించనున్నారు.



ములుగు జిల్లా వాజేడు హైస్కూల్‌లో బెంచీలపై హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న అధికారులు

### ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి

విద్యార్థులు ఒత్తిడి లేకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి. ఈ ఏడాది మొదటిసారిగా 24 పేజీల బుక్‌లెట్ అందజేస్తున్నారు. అడిషనల్స్ ఉండవు. సమాధానాలు మొత్తం అందులోనే రాయాలి. విద్యార్థులు ముందుగా తమకు బాగా వచ్చిన ప్రశ్నలకు సమాధానం రాయాలని నిపుణులు చెబుతున్నారు.



ఎమ్మెల్యే, ఎంపీ ఫొటో లేని ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ మహిళా కార్యకర్తలు

# కాంగ్రెస్‌లో మరోసారి బయటపడిన విభేదాలు

- ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ బిల్లులపై సంబురాలు
- సీఎం, నియోజకవర్గ ఇన్‌చార్జి ఫొటోలతో కూడిన ఫ్లెక్సీకి క్షీరాభిషేకం
- కడియం, కావ్య ఫొటోలు లేకపోవడంపై చర్చ

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 20 : స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ గ్రూపు రాజకీయాలు మరోసారి బయటపడ్డాయి. గురువారం ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం, బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఆమోదం పొందడంతో సీఎం రేవంత్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి సింగపురం ఇందిరతోపాటు ఇతరుల చిత్ర పటాలకు రాష్ట్ర మహిళా కార్యదర్శి మౌనిక, మండల అధ్యక్షురాలు నారగోని పద్మల ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. కాగా ఈ ఫ్లెక్సీలో నియోజక వర్గ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య ఫొటోలు లేకపోవడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల తమను ఎమ్మెల్యే కడియం శ్రీహరి పట్టించుకోవడం లేదంటూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అయినప్పటికీ కడియం వారితో చర్చించకపోవడంతో గురువారం ఎమ్మెల్యే, ఎంపీల ఫొటోలు లేకుండానే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం కొనసాగుతున్న గ్రూపులకు స్వస్తి పలకాలంటే రాష్ట్రస్థాయిలో నియోజకవర్గ ఇన్‌చార్జి సింగపురం ఇందిరకు రాష్ట్రస్థాయి గుర్తింపు వచ్చే పదవిని ఇవ్వాలన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తోడ్పడాలని వారు సీఎంను కోరారు. విజయ, అనిత, బాలమణి, లక్ష్మి, సునీత, రేణుక, సక్కుబాయి, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

# 48 గంటల్లో రైతులకు నీళ్లు ఇవ్వాలి

- లేకుంటే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పంప్‌హౌస్‌ను ముట్టడిస్తాం
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య
- దేవన్నపేట దేవాదుల పంప్‌హౌస్ సందర్శన



పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న రాజయ్య

ధర్మసాగర్, మార్చి 20 : దేవాదుల ప్రాజెక్ట్ మూడో దశ మోటర్లు ఆన్ చేసి 48 గంటల్లో రైతులకు నీళ్లు ఇవ్వాలని స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతులతో దేవన్నపేట పంప్‌హౌస్‌ను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. గురువారం ఆయన హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం దేవన్నపేటలోని దేవాదుల పంప్‌హౌస్‌ను నాయకులతో కలిసి సందర్శిం చి అధికారులతో మాట్లాడారు. అనంతరం ధర్మసాగర్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. 2008లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ధర్మసాగర్ రిజర్వాయర్ సౌత్ కెనాల్‌కు నీళ్లు విడుదల చేస్తు న్న క్రమంలో గేట్‌వాల్వ్ కీని కాల్వలో పడేసి అడ్డుకున్న దుర్మార్గుడు కడియం శ్రీహరి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మంజూరైన దేవాదుల పనులు తానే పూర్తిచేయించాననే పేరుకోసం కడియం పాకులాడుతున్నాడన్నారు. ఒకపక్క అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగానే, ఉమ్మడి జిల్లాలోని ఇద్దరు మంత్రులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిని నీళ్లు వదిలేందుకు హుటాహుటిన తీసుకొచ్చి ముఖం లేకుండా చేసుకున్న వ్యక్తి కడియం అన్నారు. గొప్పలకు పోయి ఎంత గోస పడినా, రాత్రి వరకు వేచి చూసినా మోటర్లు ఆన్ కాకపోవడంతో వెనుదిరిగి వెళ్లాల్సి వచ్చిందని, దీనిని ప్రజలు, రైతులు గమనిస్తున్నారన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల పట్టింపులేని తనంతో రైతులకు సాగు నీరందించడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. పంటలు ఎండిపోవడానికి ప్రభుత్వమే కారణమన్నారు. రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలేనని, ఈ విషయం అందరికీ తెలుసన్నారు. నియోజకవర్గంలో ఉప ఎన్నిక వస్తుందనే భయంతో తానే పనులు చేస్తున్నానని చెప్పుకోవడం కోసం కడియం వచ్చి పరువు తీసుకున్నాడని ఎద్దేవా చేశారు. ఏదేమైనా రైతులకు నీళ్లు ఇవ్వని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని రాజయ్య హెచ్చరించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జి కర్ర సోమిరెడ్డి, నాయకులు రవీందర్, జోజి, లక్క శ్రీనివాస్, ప్రతాప్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.



వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘం నాయకులు

# అక్రమ నిర్మాణాన్ని కూల్చేయాలి

- పెట్రోల్ బాటిల్‌తో వాటర్ ట్యాంక్ ఎక్కి దళితుల నిరసన
- అధికారుల హామీతో దిగొచ్చిన ఆందోళన కారులు

నర్సంపేట, మార్చి 20: వరంగల్ జిల్లా నర్సంపేటలో అక్రమ నిర్మాణాన్ని ఆపాలంటూ గురువారం దళిత సంఘం నాయకులు చేతిలో పెట్రోల్ బాటిల్‌తో వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. పట్టణంలోని మహబూబాబాద్ రోడ్డు సర్వేనంబర్ 121 ప్రభుత్వ భూమిలో ఇటీవల ఓ ప్రభుత్వ ఉద్యోగి అక్రమ నిర్మాణాన్ని చేపట్టగా, దాన్ని ఆపాలని దళిత సంఘాల నాయకులు అధికారులకు వినతిపత్రాలు అందించారు. దీంతో మూడు రోజుల క్రితం తహసీల్దార్ రాజేశ్ అక్రమ నిర్మాణాన్ని ఆపివేయాలని చెప్పినా కొనసాగింది. ఈ క్రమంలో గురు వారం అక్రమ నిర్మాణాన్ని ఆపాలంటూ చేతిలో పెట్రోల్ బాటిల్‌తో మంద ప్రకాశ్, వేల్పుగొండ రాజు, గొర్రె శాంతిబాబు, పసునూరి యశోద, కంజర్ల మంగమ్మ, వరమ్మ పట్టణంలోని వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఆర్డీవో ఉమారాణి, తహసీల్దార్ రాజేశ్, ఏసీపీ కిరణ్‌కుమార్, రూరల్ సీఐ సాయిరమణ, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి వీర స్వామి ఘటనా స్థలానికి చేరుకొని వారితో ఫోన్లో మాట్లాడారు. అక్రమ నిర్మాణాన్ని పూర్తిగా కూల్చివేయనిదే వాటర్ ట్యాంక్ నుంచి కిందికి దిగమని దళిత సంఘం నాయకులు పట్టుబట్టారు. ఈ క్రమంలో అధికారులు అక్రమ నిర్మాణం దగ్గరికి వెళ్లగా ప్రభుత్వ ఉద్యోగి భార్య, కాంగ్రెస్ పార్టీ నర్సంపేట మండల అధ్యక్షుడు బానోత్ లక్ష్మణ్‌నాయక్‌తోపాటు మరో ఇద్దరు వాగ్వాదానికి దిగారు. ఎట్టకేలకు పిల్లర్ రాడ్‌కు ఉన్న బైండింగ్ వైర్లను మాత్రమే తొలగించి వెళ్లిపోయారు. చివరకు ఉన్నతాధికారుల హామీతో ఆందోళనకారులు నిరసన విరమించారు. దీంతో దాదాపు 5గంటల పాటు కొనసాగిన హైడ్రామాకు తెరపడింది.



అధికారులతో వాగ్వాదం చేస్తున్న నిర్మాణదారులు